క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

పెద్దాపురం/సామర్లకోట: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో ఒక అంగన్‌వాడీ వర్కర్, మూడు హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష తెలిపారు. బుధవారం ఆమె ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు సంబంధించి వచ్చే నెల ఐదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. పట్టణంలోని శెట్టిపేట1 అంగన్‌వాడీ వర్కర్ (బీసీ బీ), సామర్లకోట అర్బన్ మట్టలదొడ్డి 17వ వార్డు అంగన్‌వాడీ హెల్పర్ (బీసీ ఏ), 28వ వార్డు గాంధీనగర్2 హెల్పర్ (ఓసీ), కొత్తూరు వీకే రాయపురం గ్రామానికి హెల్పర్ (ఎస్సీ) కేటగిరీల అభ్యర్థులు అర్హులని వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులై, 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చే నెల ఐదో తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పోషకాహార పథకాలపై అవగాహన పెరగాలి


సామర్లకోటలో నిర్వహిస్తున్న పోషకాహార ర్యాలీ

సామర్లకోట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పోషకాహార పథకాలపై ప్రజలకు, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ అన్నారు. స్థానిక బ్రౌన్‌పేట సెక్టార్ పరిధిలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెక్టార్‌లోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో స్వచ్ఛత హీ సేవా, పోషకాహార అవగాహన ర్యాలీ నిర్వహించారు.

జనసేన నేత ప్రాయశ్చిత దీక్ష


శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ తంగెళ్ల

పెద్దాపురం: తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రతతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా బుధవారం పట్టణంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు చేపట్టిన దీక్షకు పలువురు మద్దతు పలికారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీజేపీ నాయకుడు విత్తనాల వెంకటరమణ, పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు మద్దతు తెలిపారు.

షూటింగ్ హంగామా


సామర్లకోటలో జరిగిన షూటింగ్‌లో ఓ సన్నివేశం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో బుధవారం సాయంత్రం సినిమా షూటింగ్ హంగామా నెలకొంది. పలు సినిమాల్లో విలన్ పాత్ర పోషించిన శివరామరాజు డేవిడాన్ డాని షార్టు ఫిలిమ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆలయ కోనేరు నుంచి కలశంతో నీటిని తీసుకురాగా, పది మంది బ్రాహ్మణులు స్వాగతం పలికిన సన్నివేశమిది. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి పూజలు చేసి, అభిషేకాలు చేసిన సన్నివేశాలను చిత్రీకరించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం సూచనలతో చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో ఉన్న ఉపాలయాల్లోను పూజలు జరిగాయి. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మళ్లీ ఉల్లి లొల్లి

- కొండెక్కిన కూరగాయల ధరలు
- గూబ గుయ్ మనిపిస్తున్న చిక్కుడు
- వర్షాలతో వివిధ ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం
- కార్తికం వస్తే జనానికి మరిన్ని అవస్థలు


పెద్దాపురం సంత మార్కెట్‌లో కూరగాయల షాపు

పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలోని మార్కెట్లో కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా చాలా చోట్ల కూరగాయల తోటలు వరద నీటిలో మునిగిపోయాయి. మరికొన్ని చోట్ల వరదలకు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో గణనీయంగా పంట దిగుబడి తగ్గింది.. దీంతో కూరగాయల ధరలు మరోసారి కొండెక్కాయి. ఇప్పుడిలా ఉంటే, కార్తికమాసం మొదలు డిసెంబర్ వరకూ వివిధ రకాల పండగలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో.. మున్ముందు ధరలు ఎలా ఉంటాయోనని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రానున్న రోజుల్లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గిన సరఫరా

కూరగాయల దుకాణాలకు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు, మన రాష్ట్రంలో పొంగునూరు, పలమనేరు నుంచి టమాటా, కోల్‌కతా, ఇండోర్ నుంచి బంగాళదుంపలు, ఒడిశా నుంచి పచ్చిమిర్చి, తెలంగాణ నుంచి బీట్‌రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, రావులపాలెం నుంచి దొండకాయలు, దోసకాలు ఎక్కువగా సరఫరా అవుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురవడంతో అక్కడ పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో ఉత్పత్తి తగ్గి, సరఫరా లేకపోవడంతో ఇక్కడ కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

పెరిగిన గిరాకీ

నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట పట్టణాలతో పాటు, మండలంలోని దివిలి మార్కెట్‌కు పలు గ్రామాలతో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల పంటలు పండుతాయి. విత్తనాలు వేసిన ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో చాలా వరకు విత్తనాలు నాటలేదు. ఇప్పుడు కొద్దోగొప్పో ఉన్న పంటలతో మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో, ఒక్కసారిగా కూరగాయలకు గిరాకీ పెరిగిపోయింది.

కేజీ స్థానే అర కేజీయే కొనుగోలు



నిత్యావసర సరకులతో పాటు, కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దాంతో మార్కెట్‌లో కేజీకి బదులు అర కేజీ కూరగాయలే కొనుగోలు చేయాల్సి వస్తోంది. రెండు మాసాల క్రితం టమాటా కొనుగోలు చేయాలంటే కరెంట్ షాక్‌లా ఉండేది. ఇప్పుడు ఉల్లి షాక్ ఇస్తోంది. కిలో ఉల్లి రూ.60కు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సయ్యద్ కరీమ్ జానీ, కబడ్డీ వీధి, పెద్దాపురం

రోజురోజుకూ పెరుగుతున్నాయ్



కూరగాయలు, ఆకుకూరల ధరలు బాగా పెరుగుతున్నాయి. ఇటీవల వర్షాలకు, భారీ వరదలతో కూరగాయల పంటలు నీట మునిగాయి. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లోకి కూరగాయల దిగుమతి తగ్గింది. వచ్చిన కొద్దిపాటి కూరగాయల ధరలు పెరగడంతో చిరు వ్యాపారులం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– జి.మల్లేశ్వరరావు, కూరగాయల వ్యాపారి, కొత్తపేట వీధి, పెద్దాపురం

ప్రస్తుత మార్కెట్లో కూరగాయల రేట్లు ఇలా..

కూరగాయలు	కిలో ధర (రూ.ల్లో)
చిక్కుడుకాయలు	95
ఉల్లి	60
ఆగాకరకాయలు	80
వంకాయలు	60
బంగాళదుంప	50
బెండకాయ	60
దొండకాయ	60

ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.60 వరకూ పలుకుతున్నాయి. ఆకుకూరలు రూ.పదికి రెండు నుంచి మూడు కట్టలు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ఎలుకలతో పంట దిగుబడిపై ప్రభావం


కొమరగిరిలో ఎలుకల మందుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ


గొర్సలో వ్యవసాయాధికారులు నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం

కొత్తపల్లి: వరిపైరులో ఎలుకల బెడద వలన దిగుబడి గణనీయంగా తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు. మండలంలోని కొమరగిరి, గొర్సలో బుధవారం పొలం పిలుస్తోంది, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించారు. ఎలుకల మందు తయారీ, దాని పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోగిరాజు మాట్లాడుతూ, ఎలుకల మందు గ్రామంలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం

– ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు


సామర్లకోటలో నిమజ్జన ఊరేగింపును ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు

సామర్లకోట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహానికి బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మెప్మా కార్యాలయం ఎదురుగా ఉన్న నట్టి వారి వీధిలో జరిగిన గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలని, అప్పుడే ఇతరులకు సాయం చేయాలనే తలంపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహానికి గజమాల వేసి, స్వామి వారికి పూజలు చేశారు. నిమజ్జన ఊరేగింపును ఆవాల లాంఛనంగా ప్రారంభించారు. నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో దేవతామూర్తుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళం మధ్య నిమజ్జన ఊరేగింపు పట్టణ పురవీధుల మీదుగా ఉత్సాహంగా సాగింది. సామర్లకోట గోదావరి కాలువకు వచ్చిన గణేశ్ విగ్రహాన్ని వంతెన మీదుగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి, కమిటీ నాయకులు నరేంద్ర, నారాయణ, లోకేష్, షారూక్, చైతన్య, సాయిచరణ్, వినయ్, శివ తదితరులు భక్తులకు సేవలందించారు.


ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు

ఎంఈఓగా శ్యాంబాబు బాధ్యతల స్వీకరణ

పిఠాపురం: మండల విద్యా శాఖాధికారిగా జి.శ్యాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిఠాపురం బాదం మాధవరావు బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: ఉప్పాడలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజనల్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. ఉప్పాడ సెంటర్‌లో ఫీడర్లకు విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నట్లు చెప్పారు. దీంతో ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాలతో పాటు, అమరవల్లి రొయ్యల చెరువులు, నాగులాపల్లి రొయ్యల చెరువులు, మూలపేటలో ఉన్న వాటర్ హౌస్‌కు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా పండిట్ దీనదయాళ్ జయంతి

పిఠాపురం: బీజేపీ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం పార్టీ నియోజకవర్గ నేతలు ఘనంగా నిర్వహించారు. అంత్యోదయ సూత్రంపై దారిద్ర్య రేఖకు చిట్టచివరి వరకున్న పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో పార్టీ స్థాపించారని ఆయన సేవలను నేతలు కొనియాడారు.

ఉత్సాహంగా చెకుముకి టాలెంట్ టెస్ట్


చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

పిఠాపురం: జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చెకుముకి సంబరాలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 16 పాఠశాలలకు చెందిన 1,800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు మండల స్థాయికి జూనియర్, సీనియర్ టీంలుగా ఎంపికవుతారని చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు తెలిపారు. గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ పోటీలను మండల శాఖ అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, జిల్లా సమతా కన్వీనర్ సీహెచ్‌యూఆర్ మంగతాయారు, హెచ్‌ఎం సీహెచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి సంఘ మండల గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం పరిశీలించారు, అక్టోబర్ ఒకటిన మండల స్థాయి టెస్ట్ జరుగుతుందని, వేదికను త్వరలో ప్రకటిస్తామని నానిబాబు తెలిపారు

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడం కోసం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 28, 29 వార్డులకు సంబంధించిన ప్రజావేదికను స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా వేదిక కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరుకావడం ద్వారా సమస్యలను వెంటనే వారి దృష్టికి తీసుకెళ్లడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అధికారుల సూచనల మేరకు నిధులు సమకూర్చుతామని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కౌన్సిలర్ బలుసు వాసు, జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబా కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కాలువ అదిగో.. ఆక్రమణ ఇదిగో..

- పూడ్చేస్తున్న కాలువలు
- ముంపునకు గురవుతున్న పొలాలు, గ్రామాలు


ఉప్పాడ-అమీనాబాద్ రోడ్డులో ఆక్రమణకు గురైన ప్రధాన కాలువ

కొత్తపల్లి: పంట కాలువలు కనిపిస్తే చాలు.. ఆక్రమించేద్దామనే ఆలోచనలో ఉన్నారు కబ్జాదారులు. కాలువల ఆక్రమణలతో పొలాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. అడిగే వారు ఉండరనే ధీమాతో అనుకున్నదే తడవుగా ఆక్రమణదారులు కాలువలు పూడ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడం లేదు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లిలో ఉన్న ప్రధాన కాలువలు సైతం ఆక్రమించి, ఆ స్థలాలను లేఅవుట్లలో కలిపేస్తున్నారు. దీనిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం తూరలను ఏర్పాటు చేయకుండా, ఇళ్లకు రోడ్లు నిర్మిస్తున్నా పట్టించుకోవాల్సిన అధికారులే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. తుపాన్ల సమయంలో హడావిడి చేసే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, కాలువలను ఆక్రమిస్తున్న సమయాల్లో పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్తపల్లి-ఉప్పాడ, ఉప్పాడ-అమీనాబాద్ మీదుగా సముద్రంలోకి వెళ్లే ప్రధాన కాలువ సైతం పూర్తిగా ఆక్రమణకు గురైంది. తుపాన్లు ఏర్పడితే ముంపునీరు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఏలేరు వరద కారణంగా కొత్తపల్లిలో పొలాలు ముంపునకు గురి కాగా, రవీంద్రపురంలో వీధులన్నీ చెరువులను తలపించాయి. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి లేరు.


అమీనాబాద్‌లో ప్రధాన కాలువ దుస్థితి


ఉప్పాడ-కొత్తపల్లి ప్రధాన రోడ్డులో కాలువ ఇలా..

వర్షంతో జన జీవనం అస్తవ్యస్తం


స్టేషన్ సెంటర్‌లో సాయిబాబా ఆలయం రోడ్డు

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలతో పాటు, స్థానిక బస్సు కాంప్లెక్స్ చెరువుగా మారింది. జన జీవనం స్తంభించింది. స్టేషన్ సెంటర్, ప్రెసిడెంట్‌గారి వీధి, అయోధ్య రామపురం, రథం సెంటర్, సంపెంగ తోట, భాస్కర్‌నగర్, సాయినగర్, ప్రసన్నాంజనేయ నగర్, బ్రౌన్‌పేట, సీతారామ కాలనీ చెరువులను తలపించాయి. ప్రధాన డ్రైన్లలో పూడికలు తొలగించడంతో, పూడిక మట్టి అడ్డుపడి, వర్షపు నీరు పోయే అవకాశం లేకపోవడంతో రోడ్లు చెరువులుగా మారాయి. ఇప్పటికే రెండు సార్లు నష్టపోయిన రైతులు పొలాల్లోకి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు.


చెరువుగా మారిన సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సామర్లకోట: ఇంగ్లిష్, తెలుగు చదవడం, రాయడంపై ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు అలవాటు చేసి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. పాఠశాలల తనిఖీలో భాగంగా బుధవారం గొంచాల గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు జరుగుతున్న విద్యా ప్రవేశ కార్యక్రమాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను, నోట్, పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. ఈ నెలలో జరిగిన సెల్ఫ్ అసెస్మెంట్ 1 పరీక్షకు సంబంధించి నిర్వహణ విధానాన్ని తెలుసు కున్నారు. పరీక్ష పేపర్లను వేగంగా మూల్యాంకనం చేయాలని సూచించారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పిఠాపురం పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 3 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఖాళీలున్నట్లు చెప్పారు. కొత్తపల్లి మండలంలో 2, గొల్లప్రోలు మండలంలో 1 ఖాళీలున్నాయన్నారు. కొత్తపల్లి మండలం వాకతిప్ప1 అంగన్‌వాడీ హెల్పర్ 1, కొత్తపల్లి రవీంద్రపురం అంగన్‌వాడీ హెల్పర్ 1, గొల్లప్రోలు మండలం దుర్గాడ కృష్ణాలయంవీధి అంగన్‌వాడీ హెల్పర్ 1 ఖాళీలున్నట్లు వివరించారు. స్థానికులైన, వివాహిత అభ్యర్థులు మాత్రమే అర్హులని, విధిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు 2024 జూలై ఒకటి నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. అర్హులైన వారికి సెలెక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు పిఠాపురం కార్యాలయంలో ఈ నెల 26 నుంచి పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల ఐదు లోగా అందజేయాలన్నారు. గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్లు, పత్రాలు దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు.

27న కాకినాడలో డిపాజిటర్ల సమావేశం

పిఠాపురం: జయలక్ష్మి బ్యాంకు బాధితులైన డిపాజిటర్లందరికీ వారి సొమ్ము వాపసు చేసేలా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లామని బ్యాంకు బాధిత డిపాజిటర్ల సంఘం పిఠాపురం కన్వీనర్ యనమండ్ర సూర్యనారాయణ తెలిపారు. పిఠాపురం స్టువర్టుపేటలోని తన నివాసంలో సుబ్రహ్మణ్యం మాస్టర్‌తో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు డిపాజిటర్లంతా 27వ తేదీన కాకినాడలో జరిగే మూడో వార్షిక సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

సినిమాలు



పెద్దాపురం
లలిత 1 35
లలిత 2: గొర్రె పురాణం, ఉత్సవం
వీరభద్ర: మత్తు వదలరా 2
శోభ: మిస్టర్ బచ్చన్

సామర్లకోట:
విఘ్నేశ్వరా: మత్తు వదలరా 2
అనుశ్రీ 1: భలే ఉన్నాడే
అనుశ్రీ 2: సరిపోదా శనివారం

పిఠాపురం
అన్నపూర్ణ : సరిపోదా శనివారం
పూర్ణ : టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2 : షూస్ హైడెన్సిక్
శ్రీసత్య : గొర్రె పురాణం
శ్రీవెంకటేశ్వర : మత్తు వదలరా 2

ఉప్పాడ
శ్రీనివాస : మత్తు వదలరా 2